క్లుప్తంగా

వృద్ధులకు నేత్ర వైద్య పరీక్షలు



తోట్లవల్లూరు: ఉచిత నేత్ర శిబిరాలను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ఆప్తాల్మిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ కోరారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం(మూడో ఫేజ్)లో భాగంగా తోట్లవల్లూరు ఆరోగ్య ఉప కేంద్రంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 60 ఏళ్లు నిండిన అవ్వా, తాతలకు ఆప్తాల్మిక్ ఆఫీసర్ రాజేష్ కుమార్ కంటి పరీక్షలు నిర్వహించారు. కళ్లజోళ్లు అవసరమైన వారికి ఉచితంగా అందించటంతో పాటు శుక్లాలు ఉన్న వారికి ఆపరేషన్ల కోసం రిఫర్ చేస్తామని ఆయన తెలిపారు. శిబిరంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో ‘జగనన్నకు చెబుదాం’



మండవల్లి: మండవల్లి ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ ప్రత్యేకాధికారి ఎస్.పుష్పలత జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహణపై అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శనివారం పలు సూచనలు చేశారు. జగనన్న కాలనీల్లో నిర్మాణాలు వేగవంతం చేయడం, హౌసింగ్ లబ్ధిదారులను డ్వాక్రా రుణాలతో ప్రోత్సహించడం, సచివాలయ సిబ్బంది హాజరు, ఆన్‌లైన్ సర్వీసులు, ఆధార్ క్యాంపు నిర్వహణ వంటి వివిధ అభివృద్ధి, కార్యనిర్వాహక అంశాలపై చర్చించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.ఆనందబాబు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



గుడివాడ రూరల్: కృషి, పట్టుదలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జూనియర్ ఎన్టీఆర్ సన్నిహితుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వల్లూరిపల్లి సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక బొమ్మరిల్లు థియేటర్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఏర్పాటు చేసిన జన్మదినోత్సవ వేడుకల్లో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జన్మ దినోత్సవ కేక్ కట్ చేసి అభిమానులకు, వైఎస్సార్ సీపీ నాయకులకు అందజేశారు. జూనియర్ ఎన్టీఆర్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి గొప్ప నటుడిగా కీర్తి ప్రతిష్టలు సంపాదించాలని వల్లూరిపల్లి ఆకాంక్షించారు. ముందుగా బండి కోటి, అభిమానుల ఆధ్వర్యంలో పట్టణ వీధుల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బొమ్మరిల్లు థియేటర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో సింహాద్రి సినిమాను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, నాయకులు యార్లగడ్డ సత్యభూషణ్, గుత్తా నాని, చుండూరి శేఖర్, కొంకితల ఆంజనేయప్రసాద్, తోట రాజేష్, పుల్లేటికుర్తి కృష్ణ, అభిమానులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయానికి రూ.73 వేల ఆదాయం



ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు శ్రీపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు వేసిన కానుకలను శనివారం లెక్కించారు. గుడివాడ డివిజన్ ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. ఇటీవల జరిగిన స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు ఆలయ చైర్మన్ గులిపల్లి సుధారాణి, ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి నగదు రూపేణా రూ.72,922 ఆదాయం వచ్చిందని చైర్మన్, ఈవో తెలిపారు.

రామేశ్వరునికి వసంతోత్సవం

టేకుపల్లి(మోపిదేవి): టేకుపల్లి గ్రామంలోని బాల పార్వతి సమేత రామేశ్వర స్వామి వారికి శనివారం వసంతోత్సవం నిర్వహించారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ప్రత్యేక వాహనంపై రథోత్సవం నిర్వహించారు.

వైఎస్సార్ జలకళతో రైతులకు ప్రయోజనాలు

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



తాడంకి గ్రామంలో జలకళ పథకానికి భూమిపూజ నిర్వహించిన ఎమ్మెల్యే కైలే, నాయకులు

పామర్రు(పమిడిముక్కల): రైతులకు సుభిక్షంగా సాగునీటిని అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ జలకళ పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తోందని పామర్రు శాసనసభ్యుడు కై లే అనిల్‌కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలం తాడంకి గ్రామ పరిధిలోని తాతినేని రామ్మోహన్‌రావు పంట పొలాల్లో జలకళ బోరు ఏర్పాటు పనులకు శనివారం ఎమ్మెల్యే కైలే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంజరు బీడు భూముల్లో నీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జలకళ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. సాగునీటికి అవకాశం లేని చోట సన్న చిన్నకారు రైతులకు సాగుకు నీరు అందించేందుకు పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. సాగుకు నీరు లేక ఏ ఒక్క రైతు ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించి అమలు చేస్తోందన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా రైతులకు జలకళ అందిస్తున్నామని చెప్పారు. బోర్లు వేయటంతో పాటె సబ్‌మెర్సిబుల్ మోటర్లను సైతం ప్రభుత్వమే అందిస్తోందన్నారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

రైతుల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కైలే అన్నారు. దీని కోసం రైతులకు రైతు భరోసా, వైఎస్సార్ జలకళ ద్వారా బోర్లు ఏర్పాటు తదితరాలను అందిస్తోందన్నారు. రైతులు దరఖాస్తులు చేసుకుంటే వారి ప్రదేశాలను అధికారులు పరిశీలనలు చేసి ఎక్కడ సాగునీరు బోరు పడుతుందో రైతులకు స్పష్టం చేస్తారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వైఎస్సార్ జలకళ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కాసాని వేద సుప్రజ, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, రెడ్డిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కంభపు రాంబాబు, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు యలమంచిలి గణేష్, మారపాక మహేష్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సైన్యం.. వలంటీర్లు

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: సేవాభావంతో జగనన్న సైన్యం మాదిరిగా వలంటీర్లు చేస్తోన్న సేవలపై దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా కైకలూరు ఏఎంసీ కల్యాణ మండపంలో కైకలూరు మండలంలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను శనివారం సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వలంటీర్లు పనిచేస్తున్నారన్నారు. ప్రజలతో విడదీయరాని బంధం వారితో ఏర్పడిందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలసి మరింతగా పనిచేయాలని సూచించారు.

386 మందికి సేవా మిత్ర అవార్డులు

అనంతరం మండలంలో సేవా వజ్ర అవార్డులకు కూనవరపు రాజశేఖర్(ఆటపాక), సిద్దాబత్తిన పుష్పరాజ్యం(కొట్టాడ), సేవా రత్న అవార్డులకు దాసరి సుధాకరరావు(భుజబలపట్నం), ఘంటసాల అనూష(కొట్టాడ), మేడిశెట్టి శివశంకర్(పందిరిపల్లిగూడెం), షేక్ ఆయేషా(కై కలూరు-5), ముంగర నాగరాజు(పెంచికలమర్రు) ఎంపికయ్యారు. వీరితో పాటు ఉత్తమ ప్రతిభ కనబర్చిన 386 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు అందుకుంటున్నారు. సేవా వజ్రలకు రూ.30 వేలు, సేవా రత్నలకు రూ.20 వేలు, సేవా మిత్రాలకు రూ.10 వేల చొప్పున నగదు, సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జి, మెడల్ అందించారు. మండలంలో రూ.40,20,000 నగదు వలంటీర్ల ఖాతాలకు జమ అవుతోంది. కార్యక్రమంలో ఎంపీపీ అడివి కృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, ఎంపీడీవో కె.రామలింగేశ్వరరావు, ఈవోపీఆర్డీ రవిశంకర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.



సేవా వజ్ర అవార్డులు పొందిన వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

పోలియో నిర్మూలన ఫండ్‌కు విద్యార్థుల ఆర్థిక సాయం



రోటరీ క్లబ్ సభ్యులకు చెక్కు అందజేస్తున్న విద్యాలయ సంస్థ ప్రతినిధులు

గుడివాడరూరల్: విద్యార్థి దశ నుంచే ఎదుటివారికి సాయపడాలనే సేవా దృక్పథం కలిగి ఉండాలని రోటరీక్లబ్ కౌన్సిలర్ గవిర్నేని బాబూశ్రీకర్ తెలిపారు. పట్టణంలోని రోటరీ పోలియో నిర్మూలన ఫండ్‌కు విద్యాలయ ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు దాతృత్వంలో సేకరించిన రూ.75,116 చెక్కును స్థానిక జీవీ పూర్ణచంద్రరావు ఆడిటోరియంలో శనివారం జరిగిన కార్యక్రమంలో విద్యాలయ సంస్థ డైరెక్టర్ బొప్పన వెంకట విజయభాస్కర్ రోటరీక్లబ్ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యాలయ విద్యార్థులు స్వచ్ఛంద సంస్థల పిలుపు మేరకు గతంలో అనేక సహాయ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఎదుటివారిని ఆదుకోవాలన్న ఉద్దేశంతో విద్యార్థులు ముందంజలో ఉన్నారన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు విద్యాలయ ద్వారా నిర్వహిస్తామని చెప్పారు.

పోలియో నివారణకు రోటరీ క్లబ్ విశేష కృషి

రోటరీ క్లబ్ కౌన్సిలర్ గవిర్నేని బాబూశ్రీకర్‌బాబు మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ చేపడుతున్న అనేక సేవా కార్యక్రమాలకు దాతలు, శ్రేయోభిలాషులు, విద్యార్థులు సహకరించడం అభినందనీయమన్నారు. విద్యార్థి దశ నుంచే ఎదుటి వారిని ఆదుకోవాలన్న ఆలోచన రావడం గొప్ప విషయమని చెప్పారు. పోలియో నివారణకు రోటరీ క్లబ్ విశేషంగా కృషి చేస్తుందన్నారు. పోలియో నివారణకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు ముళ్లపూడి రమణమూర్తి, కార్యదర్శి గండు నరేష్, రోటరీ పోలియో ప్రాజెక్టు చైర్మన్ రావి శ్రీహర్షచౌదరి, అసిస్టెంట్ గవర్నర్ యలమంచిలి రెడ్డయ్యచౌదరి, యూత్ ఎఫైర్స్ తుమ్మల శ్రీనివాస్‌చౌదరి, మూడెడ్ల శ్రీధర్, ఎర్మీయ, విద్యాలయ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి చెరువులు తవ్వించాలని వినతి



కైకలూరు: పెరిగిన జనాభాకు అనుగుణంగా కొల్లేరు పరివాహక గ్రామాల్లో తాగునీటి చెరువులు తవ్వించాలని కొట్టాడ పంచాయతీ శివారు రాజుల కొట్టాడ మహిళలు ఆటపాక కార్యాలయంలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణను శనివారం కోరారు. పలువురు మహిళలు మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో పూర్వం నుంచి ఏర్పాటు చేసిన తాగునీటి చెరువుల విస్తీర్ణం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. వేసవిలో తాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాగునీరు కోసం సమీప జిల్లా గ్రామాలకు వెళ్ళి నీటిని డబ్బాలలో కొనుగోలు చేస్తున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి తాగునీటి చెరువులను తవ్వించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ.. సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.

23న వలంటీర్లకు పురస్కారాలు

ముదినేపల్లిరూరల్: మండలంలోని గ్రామ వలంటీర్లకు ఈ నెల 23న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పురస్కారాలను ప్రదానం చేస్తామని ఎంపీడీవో పి.మల్లీశ్వరీ శనివారం తెలిపారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలను అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే డీఎన్నార్ ముఖ్య అతిథిగా పాల్గొని వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తానన్నారు. మండలంలోని గ్రామ వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధుల, పంచాయతీల కార్యదర్శులు పాల్గొనాలని కోరారు.

పేదల ఇళ్లల్లో సంక్షేమ కాంతులు

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- మాకులవానిపాలెంలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, నాయకులు

మంత్రిపాలెం(మొవ్వ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల ఇళ్లల్లో సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని మంత్రిపాలెం పంచాయతీ మాకులవానిపాలెం గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కై లే పార్టీ నాయకులు, అధికారులతో గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా కుటుంబాలకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరిస్తూ ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేశారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ సంబంధిత అధికారులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు.

ప్రజల్లోకి ధైర్యంగా వస్తున్నాం..

ఈ సందర్భంగా ఎమ్మెలే కైలే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 95 శాతానికి పైగా అమలు చేశామన్నారు. దీంతో ప్రజల్లోకి ధైర్యంగా వస్తున్నామని, అవినీతి రహిత పాలనను అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు మరలా పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో తెలుగుదేశం ప్రభుత్వం చేసిన అరాచకాలను ప్రజలు మరిచిపోలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్థానిక సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే కైలే దృష్టికి తీసుకువచ్చారు.

పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

అనంతరం మొవ్వ మండలం నిడుమోలు సచివాలయంలో జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో పాల్గొని శుక్రవారం వరకు నిడుమోలులో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. అలాగే తాగునీటి సౌకర్యం, అంతర్గత రోడ్ల ఏర్పాటు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీపీ కొండేటి ఇందిర, వైస్ ఎంపీపీ డొక్కు వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, సచివాలయ మండల కన్వీనర్ సమ్మెట ఆంజనేయులు, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, గ్రామ సర్పంచ్ పంది కృష్ణ, నాయకులు పుట్టి రామకృష్ణ, నాగనబోయిన సునీల్, డొక్కు కృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీన దేవాలయాలు గ్రంథాలయాలు



మండవల్లి గ్రంథాలయంలో పెయింటింగ్స్‌పై శిక్షణ ఇస్తున్న భాస్కరరావు



జమీగొల్వేపల్లిలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

జమీగొల్వేపల్లి(పామర్రు): నవీన దేవాలయాలు మన గ్రంథాలయాలని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ తెలిపారు. మండల పరిధి జమీగొల్లేపల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్య సమర యోధుల జీవిత చరిత్ర పుస్తకాలు, చిల్డ్రన్ నాలెడ్జ్ బుక్స్, బాల సాహిత్యం, వేమన, సుమతి శతక పద్య గ్రంథాలు, విజ్ఞాన సర్వ స్వాములు, గణిత సూత్రములకు సంబంధించిన పుస్తకాలు, పంచతంత్ర , నీతికథల పుస్తకాలను పుస్తక ప్రదర్శనలు ఉంచామన్నారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి, సీహెచ్ ఆజాద్, ఎంవీ రత్నం, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. పామర్రులోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులు పలు అంశాలపై అవగాహన కల్పించామని గ్రంథాలయ అధికారి ఝాన్సీ రాణి తెలిపారు.

పెయింటింగ్‌పై తర్ఫీదు

మండవల్లి: పెయింటింగ్స్, రంగుల కలయికపై విశ్రాంత చిత్రలేఖనోపాధ్యాయుడు, ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు విద్యార్థులకు స్థానిక గ్రంథాలయంలో శనివారం అవగాహన కల్పించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో 13వ రోజు గ్రంథాలయాధికారి షేక్ పర్వీనతో కలిసి విద్యార్థులకు వాటర్ కలర్స్, పెయింటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ప్రతి రంగు విభిన్న షేడ్స్‌ను వివరించడంతో పాటు కలర్ షేడ్స్ విద్యార్థులకు చూపించి వాటి పేర్లను తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు బాబురావు

స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ

ముదినేపల్లిరూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు శనివారం స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయుడు జే బాబురావు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభశైలిలో బోధన చేశారు. అదేవిధంగా టి.సూర్యనారాయణ శతక పద్యాలు చెప్పి వాటి భావాలను వివరించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

25న జగనన్న ఆణిముత్యాలు ప్రదానం



ఏ.త్రివేణి (586)



విశ్వనాథపల్లి చాందిని(581)



మాదాసి ఈక్షిత(581)



మిక్కిలి చరిష్మా(576)



పామర్తి ధావళ్య మేఘశ్రీ(576)

పామర్రు: నియోజకవర్గంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు అవార్డులను ఈనెల 25న ఇవ్వనున్నట్లు పామర్రు ఎంఈవో పి.విజయలక్ష్మి శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలోని ఐదు మండలాల్లో పామర్రు మండలానికే జగనన్న ఆణిముత్యాలు దక్కాయన్నారు. మండల పరిధిలో ఒకరికి ప్రథమం, ఇద్దరికి ద్వితీయం, ఇద్దరికి తృతీయ స్థానాలు వచ్చాయని చెప్పారు.

విద్యార్థులకు అభినందన

మండల పరిధి నిమ్మకూరు గ్రామంలోని ఏపీ గురుకుల పాఠశాలకు చెందిన వల్లూరి త్రివేణి(586)మార్కులు సాధించి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంఈవో విజయలక్ష్మి చెప్పారు. అదే పాఠశాలకు చెందిన విశ్వనాథపల్లి చాందిని, మాదాసి ఈక్షితలు (581)మార్కులు సాధించి ద్వితీయస్థానం సాధించారన్నారు. మండల పరిధిలోని అడ్డాడ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మిక్కిలి చరిష్మా, ఏపీ గురుకుల పాఠశాల నిమ్మకూరు విద్యార్థిని పామర్తి ధావల్య మేఘశ్రీలు(576) మార్కులు సాధించి తృతీయస్థానం సాధించారని చెప్పారు. వీరికి ఈ నెల 25న జగనన్న ఆణిముత్యాలను అందిస్తామన్నారు. నిమ్మకూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.రవిబాబు విద్యార్థులను అభినందించారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.15 వేలు, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలతో పాటు సత్కరిస్తామని చెప్పారు.

భూ హక్కు సర్వేకు ప్రజలు సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ

గుడివాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న రీసర్వే పనులకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ కోరారు. జగనన్న భూ రీసర్వే కార్యక్రమాన్ని శనివారం పట్టణంలో మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏళ్ల తరబడి పరిష్కారం కానీ విధంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాలను ప్రారంభించిందన్నారు. రాష్ట్రంలో శరవేగంగా జరుగుతున్న రీసర్వే కార్యక్రమంలో గుడివాడ పట్టణంలో ప్రారంభించామని చెప్పారు. సర్వేలో భాగంగా జీసీపీ, సీపీ పాయింట్స్ మార్క్ చేసి రోవర్స్, డ్రోన్లపై సర్వే జరుగుతుందన్నారు. పురపాలక సంఘ పరిధి 12.67 చదరపు కిలో మీటర్లు ఉండగా అందులో విలీనమైన 6 గ్రామ పంచాయతీలతో కలసి 50 చదరపు కిలో మీటర్లుగా ఉన్న విస్తీర్ణంలో పట్టణ ప్రణాళిక విభాగంతో సర్వే నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. సర్వేకు పట్టణ ప్రజలు సహకరించి శాశ్వత భూ సమస్యలకు పరిష్కారం పొందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గుడివాడలో సర్వే నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

కృష్ణానదిలో యల్లారమ్మ ఘటాలకు శుద్ధి



నాగాయలంక: స్థానిక సబ్బినేని బజారులోని సబ్బినేని వారి కులదేవత యల్లారమ్మ అమ్మవారి జాతర శనివారం ప్రారంభమైంది. గ్రామస్తుల నేతృత్వంలో అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా నాగాయలంకలోని కృష్ణానదికి తీసుకువెళ్లి శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లో పుణ్యస్నానాలు చేయించారు. అనంతరం గ్రామంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని జల్దిలో ఉంచారు. జల్ది నుంచి తరలించి గ్రామోత్సవం నిర్వహించారు. ఘటాలు గుడికి చేరుకున్నాక ఆదివారం జాతర సంప్రదాయాల ప్రకారం సంబరం జరుపుతామని, భక్తులు చద్ది నైవేద్యాల సమర్పణతో మొక్కుబడులు తీర్చుకుంటారని, అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధి సబ్బినేని భుజంగరావు చెప్పారు.